నిధుల కోసం మంత్రిని కలిసిన ఎమ్మెల్యేలు


ఎమ్మెల్యేలతో కలిసి మంత్రి శ్రీధర్‌బాబుకు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: మల్కాజిగిరి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబుకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పెండింగ్‌ పనులతో పాటు, నూతన పనులు చేపట్టాలంటే నిధుల అవసరముందని వివరించారు. ముఖ్యంగా చెరువుల అభివృద్ధి, ముంపు సమస్య పరిష్కారానికి బాక్స్‌ డ్రైన్ల నిర్మాణం అవసరమని అన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

నిధులు మంజూరు చేయండి

ఉప్పల్‌ : నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని శనివారం ఉప్పల్‌ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి గ్రేటర్‌ ఎమ్మెల్యేలతో కలిసి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌ బాబును డా. బీఆర్‌ అంబేడ్కర్‌ రాష్ట్ర సచివాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో ఎమ్మెల్యేలు సుధీర్‌ రెడ్డి, గోపీనాథ్‌, కృష్ణారావు, వివేకానందగౌడ్‌, మర్రి రాజశేఖర్‌ రెడ్డి, అరిక పూడి గాంధీ ఉన్నారు.

మైనంపల్లితోనే మల్కాజిగిరి అభివృద్ధి


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్‌ నాయకులు

మల్కాజిగిరి : మల్కాజిగిరిలో అభివృద్ధి జరిగిందంటే అది కేవలం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుతోనే అని, అలాంటి వ్యక్తిపై విమర్శలు సరికావని కాంగ్రెస్‌ నాయకులు అన్నారు. శనివారం ఆనంద్‌బాగ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హన్మంతరావు బీఆర్‌ఎస్‌ పార్టీకి రాజీనామా చేసిన సమయంలో సుమారు రూ.18 కోట్ల నిధుల పనులు మంజూరయ్యాయన్నారు. నాటి బీఆర్‌ఎస్‌ ప్రభుత్వమే పనులు జరుగకుండా అడ్డుకుందని విమర్శించారు. అభివృద్ధిని హన్మంతరావు అడ్డుకున్నారని ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్‌ కార్పొరేటర్లు విమర్శించడం సరికాదన్నారు. ఇటీవల ఆర్టీసీ కాలనీ రోడ్డుకు సంబంధించిన కాలనీ వాసులు మైనంపల్లిని కలిసి వివరించారన్నారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు ప్రారంభించేలా హన్మంతరావు కృషి చేశారని తెలిపారు. అలాంటి వ్యక్తిపై విమర్శలు చేయడమంటే అభివృద్ధిని అడ్డుకోవడమే అని అన్నారు. సమావేశంలో చంద్రశేఖర్‌, వెంకటేష్‌యాదవ్‌, సతీష్‌కుమార్‌, గుండా నిరంజన్‌, శ్రీను, శ్రీనివాస్‌, సాయి, వినోద్‌యాదవ్‌, ఉమేష్‌సింగ్‌, సంతోష్‌, వినయ్‌గౌడ్‌, శంకర్‌, హరిగౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి


విజేతలకు బ్యాడ్జీలు అందజేస్తున్న కౌశిక్‌రెడ్డి

బోడుప్పల్‌ : విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని అకాడమిక్‌ హైట్స్‌ పబ్లిక్‌ స్కూల్‌ టెక్నికల్‌ డైరెక్టర్‌ ఆపరేషన్స్‌ కౌశిక్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్‌ అకాడమిక్‌ హైట్స్‌ పబ్లిక్‌ స్కూల్‌లో శనివారం నిర్వహించిన ఇన్వెస్టిట్యూర్‌ సెరిమనీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికలు నిర్వహించి స్కూల్‌ హెడ్‌ బాయ్‌, హెడ్‌ గర్ల్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. స్పోర్ట్స్‌, కల్చరల్‌, క్రమశిక్షణ కమిటీలను కూడా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నీలిమాదేవి, ప్రసన్న లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ


పుస్తకాలు అందజేస్తున్న ప్రతినిధులు

మల్కాజిగిరి : అక్షర కౌముది సంస్థ, త్రిశక్తి సేవా సమితి ఆధ్వర్యంలో నేరేడ్‌మెట్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం నోట్‌ పుస్తకాలు పంపిణీ చేశారు. ఉభయ సంస్థల అధ్యక్షులు తులసి విజయలక్ష్మి, సూర్యకుమారి మాట్లాడుతూ.. విద్యార్థులకు చేయూతనందించేందుకు సంస్థలు నిరంతరం కృషి చేస్తున్నాయన్నారు. సామాజిక, సాహిత్య , సాంస్కృతిక రంగాలు విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో కీలకమన్నారు. కార్యక్రమంలో తులసి రమణాచార్యులు, మాధవి, శ్రీనివాసరావు, రాము, సాయి, రమేష్‌, హెచ్‌ఎం జయప్రద తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి


శివకుమార్‌ను అభినందిస్తున్న కార్పొరేటర్‌ హరిశంకర్‌రెడ్డి

మేడిపల్లి : విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కార్పొరేటర్‌ దొంతిరి హరిశంకర్‌రెడ్డి అన్నారు. మేడిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థి శివకుమార్‌ బాసర ట్రిపుల్‌ ఐటీలో సీటు సాధించడంతో శనివారం ఆర్థికసాయం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు తన వంతు సాయాన్ని ఎల్లప్పుడు అందజేస్తానని తెలిపారు. అనంతరం పాఠశాలకు బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులకు స్వాగతం పలికి సన్మానించారు. పాఠశాలలో పని చేస్తున్న వాలంటీర్‌లకు తన సొంత డబ్బుతో జీతాన్ని ఆయన అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సత్యప్రసాద్‌, సత్యనారాయణ, రవీందర్‌ చారి, శివరాజు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

శ్యామాప్రసాద్‌ ముఖర్జీకి ఘన నివాళి


హబ్సిగూడలో నివాళులర్పించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి


మహంకాళి ఆలయ ఆవరణలో మొక్క నాటుతున్న మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్‌ఎస్‌ ప్రభాకర్‌

మల్లాపూర్‌: శ్యామా ప్రసాద్‌ ముఖర్జీ జయంతిని నాచారంలో బీజేపీ డివిజన్‌ అధ్యక్షుడు మల్కా ప్రకాష్‌ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి గోపాల్‌గౌడ్‌, కిసాన్‌ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు మోహన్‌రెడ్డి, చంద్రమౌళి, రాజిరెడ్డి, యేగేశ్వర్‌రెడ్డి, దయాగౌడ్‌, అశోక్‌, ప్రతాప్‌ రెడ్డి, అభిషేక్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

హబ్సిగూడ: మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి హబ్సిగూడలోని ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. శ్యామాప్రసాద్‌ ముఖర్జీ చిత్రపటానికి బేతి సుభాష్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా కార్పొరేటర్‌ కక్కిరేని చేతన హరీష్‌ ఆధ్వర్యంలో కెప్టెన్‌ వీర రాజారెడ్డి పార్కులో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మోహన్‌రెడ్డి, చంద్రమౌళి, హన్మంతరావు, ధర్మారెడ్డి, రవీందర్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, శైలేష్‌రెడ్డి, శేఖర్‌, రాఘవరెడ్డి, ఎల్లాచారి, ప్రవీణ్‌, రమేష్‌నాయక్‌, స్రవంతి పాల్గొన్నారు.

అల్వాల్‌ : అల్వాల్‌ మచ్చబొల్లారంలో బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో దుండగుల వెంకటేష్‌, మల్లికార్జున్‌యాదవ్‌, సుజాత, కరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

మౌలాలి: జయంతి సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గున్నాల లక్ష్మణ్‌గౌడ్‌ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్‌ వెంకటేష్‌, నాయకులు సంతోష్‌గౌడ్‌, కనకదుర్గ, పద్మజారెడ్డి, నళిని పాల్గొన్నారు.

ఉప్పల్‌ : డా. శ్యామా ప్రసాద్‌ ముఖర్జీ జయంతి, ఆషాఢ మాసం ప్రారంభ వేళ బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్‌ఎస్‌ ప్రభాకర్‌ మహంకాళి ఆలయ ప్రాంగణంలో త్రి శక్తి మొక్కలైన రావి, వేప, నేరేడు మొక్కలను నాటారు. కార్యక్రమంలో గౌరిగే కృష్ణ, లక్ష్మణ్‌ రెడ్డి, దేవేందర్‌రెడ్డి, విఠల్‌, రాజేందర్‌, శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.


చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

భవితకు భరోసా..
డ్రోన్‌ పైలెట్‌ కోర్సులు

శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు

రామంతాపూర్‌ : రిమోట్‌ ద్వారా డ్రోన్లను నడపడం, డ్రోన్‌ల తయారీ మరమ్మతులు, డ్రోన్లకు సంబంధించిన అనేక విషయాలపై రామంతాపూర్‌లోని కేంద్ర ప్రభుత్వ నేషనల్‌ స్కిల్‌ డెవలప్‌మెంట్‌ ఇనిస్టిట్యూట్‌లో యువతకు శిక్షణ ఇచ్చి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. కోర్సుల్లో చేరడానికి ఫోన్‌ నెంబర్లు 8978786668, 9391955105 లలో సంప్రదించవచ్చు. ఈ సంస్థలో డ్రోన్‌ పైలెట్‌ ట్రైనింగ్‌ డ్రోన్‌ టెక్నీషియన్‌ కోర్సులకు శిక్షణ ఇచ్చే ట్రైనింగ్‌ అధికారులు రాకేష్‌, ఆదర్శ్‌ సాక్షితో మాట్లాడారు. పలు విషయాల గురించి ఇంటర్వ్యూలో వివరించారు.

సాక్షి: డ్రోన్‌ ఎలా పని చేస్తుంది?

అధికారులు: డ్రోన్‌ అనేది ఫ్లయింగ్‌ రోబోట్‌ అని చెప్పవచ్చు. దీనిని సెన్సార్లు గ్లోబల్‌ పొజిషనింగ్‌ సిస్టమ్‌ (జీపీఎస్‌)తో కలిసి రిమోట్‌ ద్వారా నడపవచ్చు. డ్రోను ఎగరడానికి బ్యాటరీ లేదా ఇంధనాన్ని వాడుతారు.

సాక్షి: ఏయే వాటికి ఉపయోగపడుతుంది?

అధికారులు: డ్రోన్‌ సహాయంతో పొలాల్లో క్రిమి సంహారక మందులు, ఎరువులు స్ప్రే చేయడం, విత్తనాలు చల్లడం వంటి పనులు సులభంగా చేయవచ్చు. ట్రాఫిక్‌ పర్యవేక్షణ, తుఫాన్‌లు, వరదలు వచ్చినప్పుడు ఆ ప్రాంతంలో సహాయపడటానికి ఉపయోగపడుతుంది. వరదల్లో చిక్కుకున్న వారికి ఆహారం, మందులు సులభంగా అందించవచ్చు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు అంచనా వేయడం , భూములను సర్వే చేసి మ్యాపులు తయారు చేయడానికి ఉపయోగపడుతుంది.

సాక్షి: డ్రోన్లు ఎంత బరువు ఉంటాయి?

అధికారులు: డ్రోన్లు 250 గ్రాముల నుంచి 150 కేజీల వరకు ఉంటాయి.

సాక్షి: డ్రోన్లను నడపడానికి, తయారీ, మరమ్మతుల కోసం ఏ కోర్సులు అందుబాటులో ఉన్నాయి?

అధికారులు: డ్రోన్‌ పైలెట్‌, డ్రోన్‌ టెక్నీషియన్‌ ఆరు నెలల వ్యవధి గల కోర్సులకు శిక్షణ ఇస్తున్నాం. ఈ శిక్షణలో వివిధ డ్రోన్ల సంస్థల్లో ఆన్‌ జాబ్‌ శిక్షణ కూడా ఇస్తారు. ఈ కోర్సుల్లో చేరడానికి 18 సంవత్సరాల పూర్తై ఉండాలి. పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. డ్రోన్‌ టెక్నీషియన్‌ కోర్సుకు 16 సంవత్సరాలు నిండిన వారికి కూడా శిక్షణ ఇస్తాం. ఈ శిక్షణలో రిమోట్‌ ద్వారా డ్రోన్‌ను ఏ విధంగా ఎగరవేయవచ్చు, మరమ్మతుల గురించి శిక్షణ ఇస్తాం . చట్ట ప్రకారం డ్రోన్లను ఏయే ప్రాంతాల్లో ఎగుర వేయకూడదు, ఎగరవేయవచ్చు అనే అంశాలపై శిక్షణ ఉంటుంది.



సాక్షి: శిక్షణ పొందిన వారికి ఉపాధి అవకాశాలు ఏ విధంగా ఉంటాయి?

అధికారులు: శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలు పొందడానికి తమ సంస్థ సహాయపడుతుంది. సర్వే ఆఫ్‌ ఇండియా, ఎన్‌జీఆర్‌ఐ, సీసీఎంబీ, ఎన్‌ఎండీసీ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు ఉంటాయి. అదే విధంగా డ్రోన్లతో స్వయం ఉపాధినిచ్చే వ్యవసాయం, ఇతర రంగాలకు అద్దెకిచ్చే వ్యాపారం కూడా చేసుకోవచ్చు. డ్రోన్‌ మరమ్మతుల కేంద్రాలను కూడా ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందవచ్చు. విదేశాలలో డ్రోన్‌ పైలెట్‌గా ఉద్యోగ అవకాశాలు అపారంగా దొరుకుతాయి. తమ ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ పొందిన వారు ఇజ్రాయిల్‌ దేశంలోని వ్యవసాయ క్షేత్రంలో పైలెట్లుగా పని చేస్తూ మంచి వేతనం పొందుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్‌ నిరసన



మౌలాలి: మౌలాలి డివిజన్‌ పరిధిలోని దీన్‌దయాళ్‌నగర్‌ నాలా సమస్యను పరిష్కరించాలని శనివారం జీహెచ్‌ఎంసీ కౌన్సిల్‌ ముందు కార్పొరేటర్‌ సునీతాయాదవ్‌ ప్లకార్డు ప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారు. రెండు సంవత్సరాలు గడుస్తున్నా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని డిమాండ్‌ చేశారు.

ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

మల్లాపూర్‌: నాచారానికి చెందిన చంద్రశేఖర్‌ అనారోగ్యంతో మృతి చెందాడు. వెస్లీ పాఠశాలలో చంద్రశేఖర్‌తో పాటు చదువుకున్న 1997–98 బ్యాచ్‌కి చెందిన స్నేహితులు శనివారం రూ.60 వేలను మృతుడి భార్య ప్రవళికకు అందజేశారు. కార్యక్రమంలో రాఘవేంద్ర, బోదాసు రవి, పరమేష్‌, శ్రీను, అర్చన, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై అవగాహన ర్యాలీ


ఇన్‌స్పెక్టర్‌కు మొక్కనందజేస్తున్న చిన్నారి

మల్కాజిగిరి: మొక్కల పెంపకంపై అవగాహన కల్పిస్తూ వన మహోత్సవం పేరుతో నారాయణ ఇ టెక్నో స్కూల్‌ విద్యార్థులు శనివారం ర్యాలీ నిర్వహించారు. మల్కాజిగిరి బాలుర పాఠశాల హెచ్‌ఎం వీరేశం, ఆసుపత్రి సూపరింటెండెంట్‌ సునీత, సర్కిల్‌ డీసీ రాజు, ఇన్‌స్పెక్టర్‌ సత్యనారాయణ, సంఘ సేవకుడు బక్క నాగరాజులకు మొక్కలను అందజేశారు. కార్యక్రమంలో పద్మలత, పురుషోత్తంరెడ్డి, నరేష్‌, మమత, స్వప్న, శాలిని తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్‌



మౌలాలి: జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ ఆమ్రపాలిని శనివారం వినాయక్‌నగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ రాజ్యలక్ష్మి మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం వినాయకనగర్‌ డివిజన్‌లో నెలకొన్న సమస్యలు, డ్రైనేజీ పనులకు నిధులు కేటాయించాలని కోరారు.

జీహెచ్‌ఎంసీ మొత్తం అవినీతిమయం

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి


మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్యే

అల్వాల్‌: గ్రేటర్‌ హైదరాబాద్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ (జీహెచ్‌ఎంసీ) ప్రధాన కార్యాలయంలో జరిగిన కౌన్సిల్‌ సమావేశానికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ మొత్తం అవినీతిమయమైందని ఆరోపించారు. అధికారులు అక్రమ నిర్మాణాలు, అభివృద్ధి పనుల్లో అవినీతి జరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. వాటిపై ఫిర్యాదులు చేసినా విజిలెన్స్‌ అధికారులు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాపాలన అని చెప్పే కాంగ్రెస్‌ ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి జీహెచ్‌ఎంసీని అభివృద్ధి చేయకుండా హైదరాబాద్‌ పేరును చెడగొట్టేందుకు కుట్ర పన్నుతున్నారన్నారు. ప్రజలను చైతన్య పరుస్తూ ప్రతి వేదికపై కాంగ్రెస్‌ ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు.

కేన్సర్‌ను అరికట్టవచ్చు


క్యాంప్‌లో పాల్గొన్న సూపరింటెండెంట్‌ కమల, రోటరీ క్లబ్‌ ప్రతినిధులు

మల్లాపూర్‌: మహిళల్లో అధికంగా కేన్సర్‌ బారిన పడుతున్నారని, ముందుగానే పరీక్షలు చేయించుకుంటే దానిని అరికట్టవచ్చని నాచారం ఈఎస్‌ఐ ఆసుపత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ కమల అన్నారు. శనివారం నాచారం ఈఎస్‌ఐ ఆసుపత్రిలో బంజారాహిల్స్‌ రోటరీ క్లబ్‌, ఎంఎన్‌జె కేన్సర్‌ ఆసుపత్రి ఆధ్వర్యంలో కేన్సర్‌ నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్‌ అధ్యక్షులు అనిత నాటిబండ్ల, కార్యదర్శి కేవీమూర్తి, డైరెక్టర్‌ విజయ్‌పాల్‌రెడ్డి, వైద్యులు సావిత్రి, ఫాణి, నర్సింగ్‌ సూపరింటెండెంట్‌ గ్రేస్‌ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్‌ శ్రీనివాస్‌ ఉన్నారు.

ఆదర్శప్రాయుడు బాబూ జగ్జీవన్‌రామ్‌


నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్‌ నాయకులు


పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్‌ దేవేందర్‌రెడ్డి తదితరులు

కుషాయిగూడ: మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌ రామ్‌ వర్ధంతిని మీర్‌పేట్‌–హెచ్‌బీ కాలనీ డివిజన్‌లో ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్‌ ప్రభుదాస్‌, మాజీ కార్పొరేటర్‌ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి జగ్జీవన్‌ రామ్‌ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుషాయిగూడలో కుషాయిగూడ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు విగ్రహం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి చక్రపాణిగౌడ్‌, బాబుగౌడ్‌, కిషోర్‌, యాదయ్య, వెంకటేష్‌, గణేష్‌, దయానంద్‌, శ్రీరాములు, భాస్కర్‌, కృష్ణ పాల్గొన్నారు.

మల్లాపూర్‌: మల్లాపూర్‌ ఎలిఫెంట్‌ సర్కిల్‌ వద్ద ఉన్న బాబూ జగ్జీవన్‌రామ్‌ విగ్రహానికి మల్లాపూర్‌ కార్పొరేటర్‌ పన్నాల దేవేందర్‌ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బోదాసు లక్ష్మీనారాయణ, కృష్ణ, ప్రకాష్‌, ప్రవీణ్‌, దయాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌, ఉస్మాన్‌ పాల్గొన్నారు. అదేవిధంగా ఓల్డ్‌ మల్లాపూర్‌ బాబూ జగ్జీవన్‌రామ్‌ భవన్‌లో విగ్రహానికి, నాచారం ఎర్రకుంటలో చిత్రపటానికి పూలదండ వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యేడాల గణేష్‌, జంగం అశోక్‌, తుంగ తిరుపతి, మోహన్‌ రెడ్డి, నగేష్‌, శంకర్‌ పాల్గొన్నారు.

గౌతంనగర్‌: ఇందిరానెహ్రూనగర్‌లో జగ్జీవన్‌రామ్‌ విగ్రహానికి పూలమాలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ సీనియర్‌ నాయకులు మేకల రాముయాదవ్‌, నాయకులు రాములు, అనిల్‌, నరహరి రావు, మల్లేష్‌యాదవ్‌, నగేష్‌గౌడ్‌, శ్రీనివాస్‌, కిషన్‌ పాల్గొన్నారు.

మల్కాజిగిరి: మల్కాజిగిరి చింతల్‌బస్తీలోని విగ్రహం వద్ద మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దేశానికి జగ్జీవన్‌రామ్‌ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో వెంకటేష్‌, జీఎస్వీ సతీష్‌కుమార్‌, నిరంజన్‌, వినోద్‌ యాదవ్‌, ఉమేష్‌సింగ్‌ పాల్గొన్నారు.

ఉప్పల్‌: చిలుకానగర్‌ డివిజన్‌ షెడ్యూల్డ్‌ కులాల సేవా సంఘం అధ్యక్షుడు రాములు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్పొరేటర్‌ బన్నాల గీత ప్రవీణ్‌ హాజరై విగ్రహానికి పూల మాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రవీణ్‌ ముదిరాజ్‌, మహేందర్‌, షెడ్యూల్డ్‌ కులాల సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.


జగ్జీవన్‌రామ్‌ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

పనులను వేగవంతం చేయాలి


పనులను పరిశీలిస్తున్న రైల్వే అధికారులు

గౌతంనగర్‌: అమృత్‌ భారత్‌ స్టేషన్‌లో భాగంగా మల్కాజిగిరి రైల్వే స్టేషన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని చీఫ్‌ ప్రాజెక్ట్‌ మేనేజర్‌ ఏకే సింగ్‌ అన్నారు. శనివారం పలువురు అధికారులతో కలిసి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైల్వే స్టేషన్‌లో ఎస్కలేటర్స్‌, లిఫ్ట్‌, హైలెవెల్‌ వాటర్‌ ట్యాంక్‌, పార్కింగ్‌ ఏరియా, ఏసీ వెయిటింగ్‌ హాల్‌, రోడ్డు పనులను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో రైల్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సందర్శనార్థం అయోధ్య రాముడి విల్లు



కుషాయిగూడ: కుషాయిగూడ, ఏఎస్‌రావు నగర్‌ ప్రాంతాలకు చెందిన భక్తులు అయోధ్య రాముడి కోసం తయారు చేయించిన విల్లును శనివారం కుషాయిగూడ పద్మావతి వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల సందర్శనార్థం అందుబాటులో ఉంచారు. పూర్తిగా వెండితో తయారు చేసిన ఈ విల్లును అయోధ్యలో అందజేయనున్నట్లు తెలిపారు. శనివారం మధ్యాహ్నం వరకు విల్లును భక్తుల సందర్శనార్థం అందుబాటులో ఉంచారు. ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నీటిని పొదుపు చేద్దాం


ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

బోడుప్పల్‌: భవిష్యత్‌ తరాల కోసం నీటిని పొదుపు చేద్దామని కిరణ్‌ ఇంటర్‌నేషనల్‌ పాఠశాల వ్యవస్థాపకులు రితేష్‌ అన్నారు. బోడుప్పల్‌లో పాఠశాల విద్యార్థులచే నీటి పొదుపు అనే అంశంపై నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. వర్షపు నీటిని ఎలా పొదుపు చేసుకోవాలి, భూగర్భ జలాలను ఏ విధంగా పెంపొందించుకోవాలో విద్యార్థులకు వివరించారు. నీటి పొదుపు – ఆవశ్యకతపై విద్యార్థులు వీధి నాటకం, బుర్రకథ ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో కల్పనా రమేష్‌, ప్రిన్సిపాల్‌ కస్తూరిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఫెల్‌ కాలనీలో గోరింటాకు వేడుకలు


గోరింటాకు వేడుకల్లో పాల్గొన్న మహిళలు

మల్కాజిగిరి : సీఫెల్‌కాలనీలో కాలనీ సంక్షేమ సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు జ్యోతి ఆధ్వర్యంలో శనివారం గోరింటాకు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆరోగ్యపరంగా కూడా గోరింటాకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టీల్‌ బాటిల్స్‌ అందజేత


స్టీల్‌ బాటిల్స్‌ను అందజేస్తున్న లయన్స్‌ క్లబ్‌ ప్రతినిధులు

మల్లాపూర్‌: లయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ హైదరాబాద్‌ ఆధ్వర్యంలో శనివారం నాచారం వెస్లీ పాఠశాలలో 250 మంది విద్యార్థులకు స్టీల్‌ బాటిల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్‌ క్లబ్‌ డిస్ట్రిక్ట్‌ గవర్నర్‌ కృష్ణ ప్రసాద్‌, నాచారం మహంకాళి దేవాలయం చైర్మన్‌ కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్లాస్టిక్‌ బాటిల్స్‌ వాడటం వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. కార్యక్రమంలో వీడీజీ ఇన్నారెడ్డి, కృష్ణారెడ్డి, డీఎస్‌సీ శేఖర్‌రెడ్డి, లయన్స్‌ క్లబ్‌ అధ్యక్షుడు సదానందం, స్టీల్‌ బాటిల్స్‌ డోనర్‌ జోన్‌ చైర్మన్‌ నందికొండ శ్రీనివాస్‌రెడ్డి, వెస్లీ ఫౌండర్‌ రామప్ప, హెచ్‌ఎం రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

శ్రీవారాహి అమ్మవారి నవరాత్రులు



గౌతంనగర్‌: ఉత్తమ్‌నగర్‌లోని శ్రీదుర్గా జ్యోతిష్యాలయంలో శనివారం శ్రీవారాహి అమ్మవారి నవరాత్రి పూజలు శనివారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఉదయం బ్రహ్మ కలశ స్థాపన, పూజలు నిర్వహించినట్లు నిర్వాహకులు నాగరాజుశర్మ తెలిపారు.

చేనేత వస్త్ర ప్రదర్శనకు స్పందన


వస్త్రాలు కొనుగోలు చేస్తున్న మహిళలు

లాలాపేట: తార్నాకలోని ఐఐసీటీ స్టాఫ్‌ క్లబ్‌లో ఏర్పాటు చేసిన కళా సిల్క్‌ చేనేత వస్త్ర ప్రదర్శనకు స్పందన లభిస్తోందని నిర్వాహకులు తెలిపారు. తెలంగాణ సంస్కృతికి అద్దంపట్టే పోచంపల్లి చీరలు, బెడ్‌ షీట్స్‌, వెస్ట్‌ బెంగాల్‌ జాందాన్ని చీరలు, రాజస్థానీ కోటా చీరలు, మంగళగిరి, ఉప్పాడ, చీరలు చేనేత డ్రెస్‌ మెటీరియల్‌, లక్నో చికెన్‌ వర్క్స్‌ కుర్తీలను అందుబాటులో ఉంచామన్నారు. ఈ నెల 22 వరకు కొనసాగే ఎగ్జిబిషన్‌ను స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ ప్రతినిధి వికాస్‌ జైన్‌ వెల్లడించారు.